కరీంనగర్ ఆటో షోకు విశేష స్పందన

- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఎక్స్‌పో
- తొలి రోజు పెద్దసంఖ్యలో తరలివచ్చిన నగర ప్రజలు
- అన్నివాహనాల స్టాళ్లు.. నేటి సాయంత్రం ముగింపు

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 30: నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రం నడ్డిబొడ్డులో శనివారం ఏర్పాటుచేసిన ఆటో షోకు విశేష స్పందన వచ్చింది. మహాత్మా జ్యోతిబా పూలే (సర్కస్‌గ్రౌండ్) మైదానం వేదికగా నిర్వహించిన ఈ ఎక్స్‌పోకు తొలి రోజు పెద్ద ఎత్తున నగరవాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కరీంనగర్ డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్‌రావు, 60వ డివిజన్ కార్పొరేటర్ వాల రమణారావు, నమస్తే తెలంగాణ బ్రాంచి మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం స్టాళ్లను పరిశీలించి వాహనాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ షోలో నయా మాడల్ మారుతి డిజైర్ కారును ఆవిష్కరించి, కొద్దిసేపు నడిపి పరిశీలించారు. అనంతరం యమహా, ఎస్ఎస్ ఈవో ఎలక్ట్రిక్ వాహనాన్ని నడిపి హర్షం వ్యక్తంచేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సందర్శకులు స్టాళ్లను పరిశీలించి, నయా మాడల్ కార్లు, బైక్‌ల గురించి తెలుసుకున్నారు. పలువురు కొత్త వాహనాలను బుక్ చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం ఆటో షో ముగియనున్నది. ఈ కార్యక్రమంలో యాడ్స్ మేనేజర్ మల్లయ్య, నమస్తే తెలంగాణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో షో ఏర్పాటు అభినందనీయం: మేయర్

కరీంనగర్ ప్రజలకు అందుబాటులో ఉండేలా 'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో ఆటో షో ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని మేయర్ యాదగిరి సునీల్‌రావు కొనియాడారు. మార్కెట్‌లో సరికొత్తగా, ఆధునిక ఫీచర్లతో వస్తున్న వాహనాల మాడళ్లకు, ఈవీ వాహనాలకు సైతం ఆదరణ ఎక్కువగా ఉన్నదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా వాహనాలను ఎంచుకునే అవకాశంతో పాటు బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ఆటో షోను నగరవాసులు సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ కంపెనీ వాహనాలను ఒకే వేదికపై తెచ్చి, ఆటో షో నిర్వహించడం ఎంతో అభినందనీయమని కరీంనగర్ డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. కొత్త వాహనాలను కొనుగోలుకు ఆసక్తి ఉన్నవారు ఒకే ప్రాంతంలో అనేక కంపెనీల పూర్తి వివరాలు తెలుసుకునే అవకాశం నమస్తే తెలంగాణ నగర ప్రజలకు కల్పించిందని చెప్పారు.

కరీంనగర్‌లోని సర్కస్ గ్రౌండ్‌లో ఆటో షోను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు. చిత్రంలో కరీంనగర్ డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్‌రావు, కార్పొరేటర్ వాల రమణారావు, నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్ కే ప్రకాశ్‌రావు

తహసీల్దార్ల సమస్యలు పరిష్కరించండి

- అధికారులపై దాడుల ఘటనలపై విచారించాలి
- టీజీటీఏ అసోసియేషన్ సమావేశంలో తీర్మానం

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న తహసీల్దార్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ రాములు, కార్యదర్శి రమేశ్ పాక కోరారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం సీసీఎల్ఏ కార్యాలయం ప్రాంగణంలో జరిగింది. ముఖ్య అతిథిగా డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ఇటీవల రెవెన్యూ అధికారులపై జరుగుతున్న దాడులపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చార్మినార్ జోన్‌లో ఆపిన పదోన్నతులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ పూల్ సింగ్ హాన్, కోశాధికారి శ్రీనివాస్ శంకర్‌రావు, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ పాల్గొన్నారు.

'ట్రెసా ముందుచూపుతోనే పదోన్నతులు'

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఐదు జోన్లలో 83 మంది సీనియర్ అసిస్టెంట్లకు నాయబ్ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించడంపై ట్రెసా హర్షం వ్యక్తం చేసింది. సీఎంకు, రెవెన్యూ శాఖ మంత్రికి, సీసీఎల్ఏకు ధన్యవాదాలు తెలిపింది. ఆరో జోన్‌లోని మరో 23 మంది సీనియర్ అసిస్టెంట్లకు డిసెంబర్ 12 తర్వాత ఆమోదం లభించనున్నట్టు సంఘం అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, కార్యదర్శి కే గౌతమ్ కుమార్ పేర్కొన్నారు. ట్రెసా ముందుచూపు ఫలితంగా పదోన్నతుల ప్రవాహం కొనసాగుతున్నదని తెలిపారు. గతంలో వంద మంది డిప్యూటీ కలెక్టర్లను ఇతర శాఖలలోని ఖాళీలలో సర్దుబాటు చేయడం ద్వారా, దిగువ శ్రేణిలో తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ క్యాడర్లలో బోనస్‌గా పదోన్నతులు లభిస్తున్నాయని చెప్పారు.

4న పెద్దపల్లిలో యువశక్తి సభ

- మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): డిసెంబర్ 4న పెద్దపల్లిలో నిర్వహించే యువశక్తి సభకు సీఎం రేవంత్ హాజరై 9 వేల మందికి ఉద్యోగ నియామకపత్రాలు అందజేయనున్నట్టు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సభలో ఇటీవల గ్రూప్-4లో ఎంపికైన 8,143 మందితోపాటు 442 సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, సింగరేణిలో ఉద్యోగాలు పొందినవారికి సీఎం నియామకపత్రాలు అందజేస్తారని చెప్పారు. పెద్దపల్లి సభ ఏర్పాట్లపై శనివారం మంత్రి శ్రీధర్‌బాబు సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.

4న 593 మందికి నియామకపత్రాలు

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): సింగరేణి వ్యాప్తం గా గనులు, కార్యాలయాల్లో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను ఘనం గా నిర్వహించాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం ఆదేశించారు. 4న పెద్దపల్లిలో సీఎం, డిప్యూటీ సీఎం చేతులమీదుగా 593 మందికి నియామకపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఏర్పాట్లపై సింగరేణి అధికారులతో సమీక్షించారు.

అమెరికాలో ఖమ్మం విద్యార్థి హత్య

- దుండగుల కాల్పుల్లో దుర్మరణం
- ఐదునెలల క్రితమే ఉన్నత చదువు కోసం వెళ్లిన సాయితేజ
- శోకసంద్రంలో కుటుంబసభ్యులు

రఘునాథపాలెం, నవంబర్ 30 : ఎంఎస్ కోసం అమెరికా వెళ్లిన కొడుకు దుండగుల కాల్పుల్లో దుర్మరణం చెందాడన్న వార్త ఆ తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచింది. ఆ రోజు రాత్రే వీడియో కాల్ మాట్లాడిన కొడుకు తెల్లవారేసరికే కానరాని లోకాలకు చేరాడని ఫోన్‌కాల్ విన్న తల్లిదండ్రులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం నగరం రామన్నపేట ప్రాంతానికి చెందిన నూకారపు కోటేశ్వరరావు-వాణి దంపతులకు కుమార్తె, కుమారుడు సాయితేజ (22) ఉన్నారు. సాయితేజ జూన్ 15న ఎంఎస్ చదివేందుకు అమెరికాలోని చికాగో రాష్ట్రం కాంకోడియా యూనివర్సిటీకి వెళ్లాడు. అక్కడే ఓ షాపింగ్‌మాల్‌లో కౌంటర్ మేనేజర్‌గా పార్ట్‌టైమ్ జాబ్‌లో చేరాడు. శుక్రవారం పార్ట్ టైమ్‌జాబ్ చేస్తున్న క్రమంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు షాపింగ్‌మాల్‌లోకి వచ్చి డబ్బుల కోసం సాయితేజను డిమాండ్ చేశారు. కౌంటర్ నుంచి డబ్బులు ఇచ్చినప్పటికీ సాయితేజను దుండగులు గన్‌తో కాల్పులు జరిపి వెళ్లిపోయారు. కాల్పుల్లో సాయితేజ అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే ఉంటున్న సాయితేజ బంధువులు విషయాన్ని ఖమ్మంలోని తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలియజేశారు.

సాయితేజ ఇంటివద్ద విషాదఛాయలు

సాయితేజ ఇంటి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. స్వస్థలం రామన్నపేటకు పెద్దఎత్తున బంధువులు తరలివచ్చి సాయితేజ తల్లిదండ్రులను ఓదార్చుతున్నారు. సాయితేజ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పరామర్శించారు. సాయితేజ మృతదేహాన్ని ఖమ్మానికి తీసుకొని వచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తానా ప్రతినిధులను ఎమ్మెల్సీ కోరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సాయితేజ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి

సమస్యలను పరిష్కరించాలి: టీజీవో

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోవడంపై వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) అభిప్రాయపడింది. డిసెంబర్‌లోపు పెండింగ్ బిల్లులు పరిష్కరిస్తామని సీఎం హా మీ ఇచ్చినా, ఇంతవరకు పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంపై ప్రాథమిక సభ్యుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని పేర్కొన్నది. ఆర్థికేతర అంశాలను డిసెంబర్‌లోపు, ఆర్థికపరమైన అంశాలను మార్చి వరకు పరిష్కరించాలని డిమాండ్ చేసింది. టీజీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని శనివారం నాంపల్లిలోని టీజీవో భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎనుగుల సత్యనారాయణ మాట్లాడుతూ.. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, జనవరి వస్తే ఐదో డీఏ కూడా ఇవ్వాల్సి ఉందని గుర్తు చేశారు.

కాంగ్రెస్ ఏడాది పాలనపై నేడు చార్జిషీట్: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై రూపొందించిన చార్జిషీట్‌ను ఆదివారం విడుదల చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సంఘటన్ పర్వ్ వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదని, అందరూ అసంతృప్తితో ఉన్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ధరణిలో మార్పులకు మోకాలడ్డేదెవరు?

మొదటిపేజీ తరువాయి...

అడ్డం పడుతున్నారని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కాస్త పెద్దదైన ఏ సమస్య పరిష్కారం కోసమైనా ప్రస్తుతం అందరూ తన వద్దకే రావాల్సి ఉన్నదని, పోర్టల్‌లో మార్పులు, చేర్పులు చేస్తే తన ఆటలు సాగవనే భయంతో ఇలా వ్యవహరిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. పెండింగ్ సమస్యలు గుట్టలుగా పేరుకుపోవడానికి కారణం కూడా ఆయనేనన్న అభియోగాలు ఉన్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఆ సమయంలో ధరణి కమిటీ సభ్యులు 'తహసీల్దార్లకు, ఆర్డీవోలకు, అదనపు కలెక్టర్లకు అధికారాలు ఇవ్వకుండా పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయడం సాధ్యం కాదు' అని ఆ ఉన్నతాధికారికి స్పష్టం చేసినట్టు సమాచారం. కానీ, ఆయన ఆ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీంతో పోర్టల్‌లో ఎలాంటి మార్పులు జరగలేదని, ఫలితంగా పెండింగ్ దరఖాస్తులు పరిష్కారం కాకపోగా మరో లక్ష అదనంగా చేరాయని చెప్తున్నాయి. చివరికి ధరణిలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఇటీవలే తహసీల్దార్లకు, ఆర్డీవోలకు, అదనపు కలెక్టర్లకు అధికారాలు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే పని నాలుగైదు నెలల కిందటే చేసి ఉంటే పెండింగ్ దరఖాస్తులు గుట్టలుగా పేరుకుపోయేవి కాదని చెప్పుకుంటున్నారు. ఆ అధికారి వల్లే ఇంత ఆలస్యం అయ్యిందని ఆరోపిస్తున్నారు. పోర్టల్‌లో మార్పులు చేర్పులు చేసి సులభతరం చేయాలని, అప్పుడే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం సాధ్యం అవుతుందని కమిటీలోని ఒకరిద్దరు సభ్యులు సదరు ఉన్నతాధికారికి పదే పదే చెప్పినట్టు సమాచారం. కానీ, ఆయన పెడచెవిన పెట్టడంతో సలహాలు ఇవ్వడం మానేసినట్టు గుసగుసలున్నాయి. ఇక, పోర్టల్‌ను ప్రైవేట్ కంపెనీ నుంచి ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్ఐసీకి అప్పగించే విషయంలోనూ ఆ అధికారి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించారనే ఆరోపణలున్నాయి. బదిలీ ఎప్పుడో జరగాల్సి ఉన్నా, నిబంధనల పేరు చెప్పి అడ్డుకున్నారని, చివరికి ఒప్పందం గడువు ముగిసినా ఒక నెల ఆలస్యం కావడం వెనుక కూడా ఆయన చక్రం తిప్పినట్టు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గతంలో కుదిరిన ఒప్పందం మేరకు ఆదివారం నుంచి ధరణి పోర్టల్ నిర్వహణ ఎన్ఐసీ చేతికి వెళ్లనున్నది.

జీవో-317 బాధితులకు ఊరట

- పరస్పర, స్పౌజ్, మెడికల్ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల కేటాయింపునకు జారీ చేసిన జీవో-317 బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. కొత్తగా మ్యూచువల్, స్పౌజ్, మెడికల్ క్యాటగిరీ బదిలీలకు అవకాశం ఇచ్చింది. శనివారం మూడు వేర్వేరు జీవోలను ప్రభుత్వం జారీచేసింది. జీవో-317పై సమీక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన క్యాబినెట్ సబ్ కమిటీ పలు సిఫారసులు చేసింది. వీటి ఆధారంగా మ్యూచువల్, స్పౌజ్, మెడికల్ బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పరస్పర బదిలీల్లో భాగంగా ఇంటర్ లోకల్ క్యాడర్‌లో అవకాశం కల్పించారు. మెడికల్ బదిలీలు కోరుకునే వారు 70శాతం వైకల్యం కలిగి ఉన్నవారై ఉండాలి. మానసిక వికలాంగులైన పిల్లలున్నవారు సైతం అర్హులే. క్యాన్సర్, న్యూరో సర్జరీ, కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఓపెన్ హార్ట్ సర్జరీ అయిన వారు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 31లోపు సంబంధితశాఖలు జీఏడీకి సమాచారాన్నిచ్చి బదిలీ చేయవచ్చు. స్పౌజ్ బదిలీల విషయంలో ఖాళీలను బట్టి బదిలీలకు అవకాశం ఇచ్చింది.

'జీవో -317'పై యూటీఎఫ్ అసంతృప్తి

జీవో-317 నిబంధనలకు అనుగుణంగా మాత్రమే బదిలీలకు అవకాశం కల్పించడంపై టీఎస్ యూటీఎఫ్ అసంతృప్తి వ్యక్తంచేసింది. బాధితులకు న్యాయం చేయడం విషయంలో సర్కారు తీరు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉందని అభిప్రాయపడింది. క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి, నెలలపాటు శోధించి గత ప్రభుత్వం చేసిన పనిని ఆమోదించడం మినహా ఏం చేయలేకపోయిందని రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి అభిప్రాయపడ్డారు. పది నెలలుగా ఎన్నో ఆశలు పెట్టుకున్నవారు జీవోలను చూసి నిరాశ నిస్పృహలకు లోనయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి జీవో-317 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

'పుష్ప-2' టికెట్ రేట్ల పెంపు

ఈ నెల 4న బెనిఫిట్ షోస్‌కు అనుమతి

హైదరాబాద్, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 5న విడుదల అవుతున్న 'పుష్ప-2' చిత్రం మన రాష్ట్రంలో మాత్రం ఒకరోజు ముందే సందడి చేయనున్నది. 4న పలు థియేటర్లలో బెనిఫిట్ షోలు ప్రదర్శించనున్నారు. మరోవైపు 'పుష్ప-2' బెనిఫిట్ షో టికెట్ ధరపై అదనంగా రూ.800 పెంచుకునేందుకు హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబర్ 4న రాత్రి 9:30, అర్ధరాత్రి ఒంటిగంట షోకు రూ.800 పెంపు వర్తించనున్నది. దీంతో జీఎస్టీ అన్నీ కలుపుకొని సింగిల్ స్క్రీన్స్ టికెట్ ధర రూ.1121కాగా, మల్టీప్లెక్స్ టికెట్ ధర రూ.1239గా నిర్ణయించారు. మొదటి నాలుగు రోజులపాటు సింగిల్ స్క్రీన్స్ టికెట్ ధరపై రూ.150, మల్టీప్లెక్స్ టికెట్ ధరపై రూ.200 పెంచుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఇక, డిసెంబర్ 9 నుంచి 16 వరకు సింగిల్ స్క్రీన్లపై రూ.105, మల్టీప్లెక్స్‌లో రూ.150, డిసెంబర్ 17 నుంచి 23 వరకు సింగిల్ స్క్రీన్ టికెట్‌పై రూ.20, మల్టీప్లెక్స్ టికెట్‌పై అదనంగా రూ.50 ధర పెంచేందుకు హోంశాఖ ఆదేశాలిచ్చింది. ఆ తర్వాత సాధారణ రేట్లు ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది. ఇదిలా ఉండగా 'పుష్ప-2' చిత్రం ఆరు భాషల్లో 12 వేలకి పైగా స్క్రీన్‌లలో విడుదలకానున్నది. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది.

భానుమతి రామకృష్ణ సాక్షిగా..

చిత్రం

దివంగత నందమూరి హరికృష్ణ మనవడు, నందమూరి జానకిరామ్ తనయుడు నందమూరి తారక రామారావుని హీరోగా పరిచయం చేస్తూ దర్శక, నిర్మాత వైవీఎస్ చౌదరి ఓ చిత్రాన్ని నిర్మించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో తెలుగమ్మాయి వీణారావు కథానాయికగా పరిచయం అవుతున్నది. శనివారం వీణారావు ఫస్ట్ లుక్‌ని ప్రొడ్యూసర్స్ సుప్రియ యార్లగడ్డ, స్వప్న దత్‌లు లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన షో గ్లింప్స్‌లో సంప్రదాయబద్ధంగా, మోడ్రన్ అవుట్ ఫిట్స్‌లో బ్యూటీఫుల్‌గా వీణారావు దర్శనమిచ్చారు. కథ, సన్నివేశాలు, పాత్రలకు అనుగుణంగా నటించి, ప్రేక్షకుల్ని రంజింపజేయడంలో తన వంతు కృషి చేస్తానని తన అభిమాన నటి డాక్టర్ పి.భానుమతి రామకృష్ణ సాక్షిగా వీణారావు ప్రమాణం చేశారు. తెలుగమ్మాయి వీణారావు ప్రతిభావంతురాలైన కూచిపూడి డ్యాన్సర్ అని, తెరపై అద్భుతమైన నటిగా కూడా రాణించే టాలెంట్ తనకుందని, యంగ్ చాప్ ఎన్టీఆర్ ఫస్ట్‌లుక్‌కి ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన స్పందన వచ్చిందని, అలాగే వీణారావు కూడా అందరికీ నచ్చుతుందని దర్శకుడు వైవీయస్ చౌదరి ఆశాభావం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన నిర్మాతలు స్వప్నదత్, సుప్రియ యార్లగడ్డ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. త్వరలో షూటింగ్ జరుపుకోనున్న ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, సాహిత్యం: చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమేష్ అత్తిలి, నిర్మాత: యలమంచిలి గీత, నిర్మాణం: న్యూ టాలెంట్ రోర్స్.

మాటిచ్చింది నిజమేనట.. కానీ!

ప్రభాస్ హీరోగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వం సినిమా.. ఈ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వినపడుతున్నది. ఇందులో నిజం ఎంత? అనే విషయానికొస్తే.. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో అరడజను సినిమాలున్నాయి. వాటిల్లో రాజాసాబ్, ఫౌజీ(టైటిల్ పరిశీలనలో ఉంది) చిత్రాలు షూటింగ్ దశలో ఉన్నాయి. కల్కి-2, స్పిరిట్ చిత్రాలు ప్రీప్రొడక్షన్ దశలో ఉన్నాయి. 'సలార్-2' చిత్రానికి ఇంకా టైమ్ ఉంది. ఇవి గాక ఇంకొన్ని కమిట్మెంట్లు పైప్ లైన్లో ఉన్నాయి. ప్రస్తుతం ప్రభాస్ అంత బిజీగా ఉన్నారు. ఇక ప్రశాంత్‌వర్మ విషయానికొస్తే.. నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ తొలి చిత్రాన్ని డైరెక్ట్ చేసే పెద్ద బాధ్యతను భుజానికెత్తుకున్నారాయన. మరోవైపు 'జై హనుమాన్' ఎలాగూ ఉంది. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తవ్వాలంటే.. ప్రభాస్‌కు ఓ ఐదేళ్లు, ప్రశాంత్‌వర్మకు ఓ రెండేళ్లు పట్టక తప్పదు. ఇక అసలు విషయానికొస్తే.. ప్రశాంత్‌వర్మతో పని చేసేందుకు ప్రభాస్ ఓకే చెప్పిన మాట నిజమే అని సమాచారం. అయితే.. అది కార్యరూపం దాల్చడానికి కొన్నేళ్లు పడుతుంది. అంతే కాదు, కాలం కూడా కలిసిరావాలి. అదన్నమాట అసలు విషయం.

'RC16'లో మీర్జాపూర్ మున్నాభాయ్

'గేమ్ చేంజర్' పూర్తి చేసి, 'RC16' షూటింగ్‌లో బిజీ అయిపోయారు రామ్‌చరణ్. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ మైసూర్‌లో మొదలైన విషయం తెలిసిందే. 'ఉప్పెన'ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో, మైత్రీమూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో, వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పాన్‌ఇండియా ప్రాజెక్ట్‌పై అంచనాలు ఓ స్థాయిలో ఉన్నాయి. హై టెక్నికల్ వ్యాల్యూస్‌తో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కన్నడ అగ్రనటుడు శివరాజ్‌కుమార్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఇప్పుడు బాలీవుడ్ నటుడు 'మీర్జాపూర్'ఫేం దివ్యేందు శర్మ కూడా ఈ సినిమాలో భాగం అయ్యారు. 'మీర్జాపూర్'లో మున్నాభాయ్‌గా తనదైన నటనతో ప్రేక్షకుల్ని మెప్పించిన దివ్యేందు.. ఈ సినిమా ద్వారా టాలీవుడ్‌కి ఎంట్రీ ఇవ్వడంపై చిత్ర యూనిట్ ఆనందం వ్యక్తం చేస్తూ శనివారం ఆయన ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసింది. మెలితిప్పిన మీసంతో రగ్గ్‌డ్‌గా ఈ లుక్‌లో దివ్యందు కనిపిస్తున్నారు. ఈ స్క్రిప్ట్‌లో తనకెంతో ఇష్టమైన పాత్ర ఇదేనని ఈ సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు తెలియజేశారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహ్మాన్.

మరోసారి ఇంట్లో 'క' చూడండి

' 'క' సినిమాకు మేం ఎంత ప్రమోషన్ చేశామో, ఈటీవీ విన్ వాళ్లు అంత ప్రమోషన్ చేసి, పైరసీ అనేది జరగకుండా జాగ్రత్తగా సినిమాను ప్రతి ఒక్కరి ఇంటికి చేర్చారు. డాల్బీ విజన్ 4కే, అట్మాస్ టెక్నాలజీ నుంచి ఓటీటీకి వచ్చిన తొలి తెలుగు సినిమా 'క'నే కావడం విశేషం. అందుకు ఈటీవీ విన్ టీమ్‌కి థాంక్స్ చెప్పుకుంటున్నా. థియేటర్లో చూసిన వాళ్లు కూడా మరోసారి ఇంట్లో 'క' చూడండి. ఎందుకంటే సెకండ్ టైమ్ ఇంకా బాగా అనిపించిందని చూసిన వాళ్లు చెబుతున్నారు' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన హీరోగా, దర్శక ద్వయం సుజీత్. సందీప్ దర్శకత్వంలో చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మించిన 'క' చిత్రం ఇటీవల విడుదలై మంచి విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. అలాగే విడుదలైన అన్ని భాషల్లో సినిమా మంచి వసూళ్లు రాబట్టిందని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'క' బ్లాక్‌బస్టర్ ధమాకా ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడారు. ఓటీటీలో కూడా 'క'కు మంచి ఆదరణ లభిస్తుండటం పట్ల దర్శకులు సుజీత్, సందీప్ ఆనందం వెలిబుచ్చారు.

స్త్రీ గొప్పతనాన్ని ఆవిష్కరించే 'నారి'

ఆడపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి అనే కాన్సెప్ట్‌తో రూపొందిన చిత్రం 'నారి'. సీనియర్ నటి ఆమని లీడ్ రోల్ చేసిన ఈ చిత్రంలో వికాస్ వశిష్ఠ, మౌనికరెడ్డి, ప్రగతి, కేదార్ శంకర్, ప్రమోదినీ కీలక పాత్రధారులు. సూర్య వంటిపల్లి దర్శకుడు. శశి వంటిపల్లి నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా పోస్టర్, గ్లింప్స్‌ని విడుదల చేసిన రాష్ట్రమంత్రి సీతక్క.. చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'మహిళల పట్ల సమాజం ఎలా వ్యవహరించాలి?.. వారికి ఎలా సహకరించాలి?.. అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా. ప్రతి మహిళా తమ ఇంట్లోని పురుషుడ్ని వెంట తీసుకెళ్లి ఈ సినిమా చూపించాలి' అని దర్శకుడు కోరారు. ఈ చిత్రానికి కెమెరా: వి.రవికుమార్, భీమ్ సాంబ, సంగీతం: వినోద్‌కుమార్.

ఆద్యంతం ఉత్కంఠ

మోహన్ వడ్లపట్ల స్వీయదర్శకత్వంలో నిర్మించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'M4M' (Motive for murder). జో శర్మ కథానాయిక. ఈ చిత్రం విడుదలకు ముస్తాబవుతున్నది. దర్శక,నిర్మాత మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ ' కథను నమ్ముకొని చేసిన సినిమా ఇది. 110ఏళ్ల సినిమా చరిత్రలో ఇప్పటివరకూ ఇలాంటి కాన్సెప్ట్ రాలేదని నమ్మకంగా చెప్పగలను. హాలీవుడ్ రేంజ్‌లో సినిమాను తెరకెక్కించాం. జోశర్మ నటన సినిమాకు హైలైట్. విడుదలైన ఫస్ట్‌డే ఈ సినిమా చూసి, ఇందులో కిల్లర్ ఎవరో గెస్ చేసి చెప్తే, ఒక్కొక్కరికీ లక్ష రూపాయలు బహుమతిగా ఇస్తాం' అని తెలిపారు. ఇందులో తాను ఇన్విస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా చేశానని, ఆద్యంతం ఉత్కంఠభరితంగా సినిమా ఉంటుందని జోశర్మ తెలిపింది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో త్వరలోనే విడుదల కానున్న ఈ సినిమాలో సంబీత్ ఆచార్య, శుభలేఖ సుధాకర్, ఎంఆర్‌సీ వడ్లపట్ల, తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సంతోష్ షానమోని, సంగీతం: వసంత్ ఇసాయిపెట్టై.

తెలుగులో 'డా..డా'

గత ఏడాది తమిళంలో విడుదలైన 'డా..డా' చిత్రం మంచి విజయం సాధించింది. కవిన్, అపర్ణదాస్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాను జేకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మాత నీరజ కోన తెలుగులో 'పా..పా' పేరుతో విడుదల చేయబోతున్నారు. డిసెంబర్ 13న ప్రేక్షకుల ముందుకురానుంది. తండ్రీకొడుకుల సెంటిమెంట్‌తో రూపొందించిన ఈ సినిమా తమిళంలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిందని, ఫీల్‌గుడ్ ఎమోషన్‌గా డ్రామా మెప్పించిందని, తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా కనెక్ట్ అయ్యే కథ ఇదని నిర్మాత నీరజ కోన తెలిపారు. భాగ్యరాజా, వీటీవీ గణేష్, ఐశ్వర్య, ప్రదీప్‌శక్తి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: జెన్ మార్టిన్, దర్శకత్వం: గణేష్ కె బాబు.

ఆ ప్రచారం వల్ల వాళ్లకు ఒరిగేదేంటో?

ప్రెగ్నెన్సీ కారణంగా షూటింగ్‌లకు దూరమైన దీపిక.. మళ్లీ కెమెరా ముందుకు వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇటీవలే ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు దీపిక పడుకోన్. 'జీవితం అంటే అనుభవాల సమాహారం. అందులో కొన్ని చేదుగా ఉంటే, కొన్ని తీపిగా ఉంటాయి. ప్రస్తుతం అమ్మగా తీయనైన అనుభూతిని ఎంజాయ్ చేస్తున్నాను. ఇక నటిగా నా బాధ్యతను నిర్వర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకే ఓవైపు కథలు కూడా వింటున్నా. 'కల్కి2898ఏడీ' తర్వాత సౌత్ నుంచి కొన్ని ఆఫర్లు వచ్చాయి. కానీ.. నా స్థాయికి తగ్గట్టుగా అవి లేవు. అందుకే అంగీకరించలేదు. సరైన కథలు వస్తే తప్పకుండా మళ్లీ సౌత్ సినిమాలో నటిస్తా' అని తెలిపారు దీపిక పడుకోన్. ఇంకా మాట్లాడుతూ- 'నేను పారితోషికం ఎక్కువగా డిమాండ్ చేస్తున్నానని ఓ వార్త ఈ మధ్య బాగా ట్రోల్ అవుతున్నది. అందులో ఏ మాత్రం నిజం లేదు. 'కల్కి 2898ఏడీ'కి ఏకంగా పదికోట్లు తీసుకున్నానని కూడా రాసేశారు. అవాస్తవాలు ప్రచారం చేయడం వల్ల వాళ్లకు ఒరిగేదేంటో నాకైతే అర్థం కాలేదు. కథ, పాత్ర నచ్చితే.. రెమ్యునరేషన్ గురించి నేను పట్టించుకోనని నా నిర్మాతలందరికీ తెలుసు' అంటూ చెప్పుకొచ్చింది దీపిక పడుకోన్.